సాక్షి
చిత్తూరు

సోమవారం। 30। అక్టోబర్। 2023



కొళ్లాపురమ్మను కొలుస్తూ..
నారాయణవనం మండలం పడిపేటమ్మ ఎస్టీ కాలనీలో గిరిపుత్రులు కట్టుబాట్లతో ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారు. - 8లో



శాస్త్రోక్తంగా గ్రహణ శాంతి పూజలు
కాణిపాకం శ్రీవినాయకస్వామి ఆలయంలో గ్రహణ శాంతి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో



పొదుపు సొమ్ము రూ.16 లక్షలు స్వాహా?
పుదిపట్ల పోస్టాఫీసులో పొదుపు సొమ్ము రూ.16 లక్షలు స్వాహా అయిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలను వినతులు రూపంలో అందజేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. స్పందనలో నమోదయ్యే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు స్పందనకు కచ్చితంగా హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరైతే శాఖా పరంగా కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..
చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడ వచ్చని పేర్కొన్నారు.

రూ.1.27 కోట్ల విద్యుత్ బిల్లుల వసూలు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సౌకర్యార్థం ట్రాన్స్‌కో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం కూడా పనిచేశాయని ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని 8 డివిజన్ల ద్వారా 10,192 మంది వినియోగదారులు బిల్లులు చెల్లించగా రూ.1.27 కోట్లు వసూలైందని వివరించారు. వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని తెలిపారు.

ఆపస్ నూతన కార్యవర్గం



ఆపస్ నూతన జిల్లా కార్యవర్గ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా మంజునాథ గుప్తా (కుప్పం), ప్రధాన కార్యదర్శిగా విజయ్ (నగరి), జిల్లా గౌరవాధ్యక్షుడిగా మేకల సుబ్రహ్మణ్యం (పుత్తూరు), కోశాధికారిగా హనుమంత రెడ్డి (చిత్తూరు), మీడియా ప్రతినిధిగా రాధాకృష్ణ (బంగారుపాళ్యం)ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంజునాథ గుప్తా, విజయ్‌లు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు వారికి అభినందనలు తెలిపారు.

జెస్సీకి పోలీసుల నివాళి



నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పోలీసులు శాఖలో తొమ్మిదేళ్లపాటు సేవలందించిన శునకం (జెస్సీ) క్యాన్సర్‌తో ఆదివారం మృతి చెందింది. పలువురు పోలీసు అధికారులు శాలువలు కప్పి, పూలమాలతో నివాళులర్పించారు. డాగ్ స్క్వాడ్ విభాగం ఆవరణలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సమయంలో డాగ్‌స్క్వాడ్ విభాగం ఘన నివాళులర్పించింది. ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి జెస్సీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు రామ్మోహన్, రఘు పాల్గొన్నారు.

తిరుమలలో విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమలలో నవంబర్ నెలలో జరగనున్న విశేష దినాలను టీటీడీ పీఆర్వో విభాగం ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేసింది. నవంబర్ 9న మతత్రయ ఏకాదశి, 11న మాస శివరాత్రి, 12న దీపావళి ఆస్థానం, 13న కేదారగౌరీ వ్రతం, 14న శ్రీతిరుమల నంబి శాత్తుమొర, 15న భగినీహస్త భోజనం, 16న శ్రీ మనవాళ మహాముని శాత్తుమొర, 17న నాగులచవితి, పెద్దశేష వాహన సేవ నిర్వహిస్తారు. 18న వార్షిక పుష్పయాగానికి అంకురార్పణం, 19న శ్రీ వారి పుష్పయాగం, అత్రి మహర్షివర్ష తిరునక్షత్రం, స్కందషష్టి, 22న శ్రీయాజ్ఞవల్క్య జయంతి, 23న ప్రబోధన ఏకాదశి, 24న కైశిక ద్వాదశి ఆస్థానం, శ్రీ చక్రతీర్థ ముక్కోటి, 26న కార్తీక పౌర్ణమి, 27న శ్రీతిరుమంగై ఆళ్వార్ శాత్తుమొర, 28న శ్రీతిరుప్పాణాళ్వార్ వర్ష తిరునక్షత్రం జరగనున్నట్లు తెలిపారు.

గురుతరం.. కళాభివందనం!

ఉపాధ్యాయులుగా పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. అంకిత భావంతో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. అదే క్రమంలో తమకు నచ్చిన రంగాల్లోనూ సత్తా చాటుతున్నారు. విభిన్న అంశాల్లో ప్రతిభను కనబరుస్తూ ప్రశంసలందుకుంటున్నారు. హిందీ పండిట్ మల్లీశ్వరి యోగా గురువుగా మన్ననలు పొందుతున్నారు. తెలుగు పండిట్ రవి హరిదాసుగా వంశపారంపర్య వృతిని కొనసాగిస్తున్నారు. టీటీడీ శిల్ప కళాశాల అతిథి అధ్యాపకుడు మునిరత్నంరెడ్డి కలంకారీలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. కాంట్రాక్ట్ డాన్స్ టీచర్ గంగాధరం జానపద నృత్యానికి ప్రాణం పోస్తున్నారు. ఇటు బోధన.. అటు సాధనతో రాణిస్తూ అవార్డులు.. రివార్డులు అందుకుంటున్నారు. - సాక్షి, తిరుపతి డెస్క్

- పాఠ్యాంశాలు బోధిస్తూ.. ఇతర రంగాల్లోనూ రాణిస్తున్న ఉపాధ్యాయులు
- కలంకారీ కళలో ప్రతిభ చాటుతున్న మునిరత్నం
- రచయితగా ముందుకు సాగుతున్న రవి
- ధ్యాన ప్రచారంలో ధీటుగా అడుగులు వేస్తున్న మల్లీశ్వరి
- జానపద నృత్యంలో దిట్ట గంగాధరం

కలంకారీలో అద్భుతాలు



తాను చిత్రించిన వైఎస్సార్ వృక్షం కలంకారీ చిత్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహూకరిస్తున్న మునిరత్నంరెడ్డి (ఫైల్)


పిచ్చాటూరు మండలం కారూరు గ్రామానికి చెందిన పూజారి మునిరత్నంరెడ్డి కలంకారీలో అద్భుతంగా రాణిస్తున్నారు. ఆయన తండ్రి మునస్వామిరెడ్డి వీధి నాటకాలు ప్రదర్శించేవారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో మునిరత్నం 5వ తరగతి లోనే చదువు మానేసి వ్యవసాయ కూలీగా మారారు. అయితే రోజూ సాయంత్రం ఇంట్లో పలక, గోడలు, నేలమీద పుస్తకాల్లోని బొమ్మలు గీసేవారు. క్రమేణా అదే వ్యాపకంగా మారిపోయింది. ఓ స్నేహితుడి ప్రోత్సాహంతో 1979లో మద్రాసులోని సంతనీ విద్యాలయం నుంచి డ్రాయింగ్‌లో డిప్లొమా తీసుకున్నారు. తర్వాత సినిమా రంగంవైపు అడుగులు వేశారు. 1986లో మద్రాసుకు వెళ్లి అజయ్ అనే డిజైనర్ వద్ద పనికి చేరారు. సినీ రంగం హైదరాబాదుకు తరలడంతో తిరిగి స్వగ్రామానికి వచ్చేశారు. పూట గడవడం కోసం కొన్ని రోజులు గోడల మీద, శిలా ఫలకాల మీద పేర్లు రాసేవారు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తిలోని కలంకారీ కళాశాలకు వెళ్లి రెండేళ్ల కోర్సులో చేరారు. అప్పటికే డ్రాయింగ్‌పై పట్టు ఉండడంతో కేవలం 3 నెలల్లోనే కలంకారీ కళను నేర్చుకున్నారు. గురువు ఐతూరు మునికృష్ణయ్య నేతృత్వంలో మరిన్ని మెళకువలను ఔపోసన పట్టారు. ఇక అప్పటి నుంచి వెనుతిరిగే సందర్భమే రాలేదు.

వరించిన అవార్డులు
సత్యహరిశ్చంద్ర కథను అద్భుతంగా బొమ్మల రూపంలో తయారు చేసినందుకు 2017లో జాతీయ మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. 2014లో మచిలీపట్నం పట్టాభి కళాపీఠం అవార్డు తీసుకున్నారు. 2013లో శ్రీనివాస కళ్యాణాన్ని చిత్రించినందుకు హ్యాండీక్రాఫ్ట్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. మునిరత్నం ప్రతిభను టీటీడీ 2014లో శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాలలో అతిథి అధ్యాపకుడిగా అవకాశం కల్పించింది.

వైఎస్సార్ కుటుంబంపై అభిమానం
దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు ఆయన కుటుంబంపై మునిరత్నంరెడ్డికి ఎనలేని అభిమానం. మహానేత వల్ల ప్రజలకు కలిగిన మేలు, ఆయన కోసం జనం పరితపించే సన్నివేశానికి అద్దం పట్టేలా కలంకారీ చిత్రం తయారు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయనకు తన కలంకారీ చిత్రాన్ని బహూకరించారు. అలాగే నవరత్నాలను కలంకారీ కళతో ఆవిష్కరించి ముఖ్యమంత్రి మన్ననలు పొందారు. ఇటీవల తిరుమల శ్రీవారి గరుడ సేవ విచ్చేసిన ముఖ్యమంత్రికి వేంకటేశ్వర స్వామి చిత్రపటం, సీఎం దంపతుల చిత్రపటాలు అందించి శభాష్ అనిపించుకున్నారు.

మంచి భవిష్యత్
అనుకోకుండా కలంకారీ కళ పరిచయమైంది. 5వ తరగతి చదివిన నాకు అర్హత కూడా అదే కావడంతో పట్టుదలతో నేర్చుకోగలిగా. ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు కలంకారీ కళను అభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మంచి భవిష్యత్ ఉంటుంది.
– మునిరత్నంరెడ్డి, కలంకారీ కళాకారుడు





మునిరత్నం తీర్చిదిద్దిన వైఎస్సార్ నవరత్నాలు కలంకారీ చిత్రం

ధ్యానమే ధ్యాస..



తిరుమలలో శ్రీవారి సేవకులకు ధ్యానం నేర్పుతున్న మల్లీశ్వరి

అన్నమయ్య జిల్లా పెద్దతిప్ప సముద్రం మండలం కందుకూరు గ్రామానికి చెందిన ఆర భాగ్యమ్మ, శంకరప్ప దంపతుల మొదటి సంతానం ఆర్.మల్లీశ్వరి. ప్రస్తుతం పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పని చేస్తున్నారు. గత 20 ఏళ్లుగా వృతిలో ఉత్తమంగా రాణిస్తున్నారు. 12 ఏళ్ల క్రితం ఆమె హైబీపీ, తలనొప్పితో బాధపడే వారు. ఆ సమయంలో సహోపాధ్యాయిని వసుంధర ధ్యానం గురించి చెప్పి, నేర్పించారు. నిత్యం ధ్యానం చేయడం వల్ల తనకు ఉన్న ఆరోగ్య సమస్యలు తొలగిపోయాయి. అనంతరం పిల్లలకు ధ్యానాన్ని ఎలా బోధించాలి అనే అంశంపై బెంగుళూరులోని స్పిరుచువల్ సైన్స్ అకాడమీలో టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేశారు. అలా తాను నేర్చుకున్న ధ్యానాన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు నేర్పడంతో పాటు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడులో ధ్యాన తరగతులు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు అహింస, శాఖాహార ప్రచారాలు, ర్యాలీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 2022 జూన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చైనా సరిహద్దులోని రేహ్, లడాక్ లకు తన బృందంతో కలిసి వారం రోజుల పాటు 'శాంతి, శాఖాహార' ర్యాలీలు చేపట్టారు. గత ఏడాది నుంచి ప్రతి మంగళవారం తిరుపతిలో, ప్రతి బుధవారం తిరుమలలో టీటీడీ ఉచిత సేవకులకు ధ్యానం నేర్పిస్తున్నారు. వీటితో పాటు గూగుల్ మీట్ వంటి ఆన్‌లైన్ ద్వారా కూడా ధ్యానం క్లాసులు నిర్వహిస్తున్నారు. మల్లీశ్వరి ధ్యానం ద్వారా చేసే సేవలకు పలు ప్రశంసలు, అవార్డులు ఆమెను వరించడం విశేషం.

ప్రయోజనాలను గుర్తించాలి
ధ్యానం వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలను అందరూ గుర్తించాలి. ధ్యానంతో ప్రశాంతమైన, ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చు. హింసకు తావు లేకుండా అహింసా మార్గం వైపు ప్రజలు అడుగులు పడాలి. ఇందుకోసం నా ప్రయత్నం కొనసాగుతూనే ఉంటుంది. హిందీ పండిట్ ఉద్యోగంతో పాటు మిగిలిన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడానికి కారణం ధ్యానమే. – ఆర్.మల్లీశ్వరి, హిందీ పండిట్



కవి..కథకుడు..



కార్వేటి నగరంలో హరికథ ప్రదర్శన ఇస్తున్న తెలుగు పండిట్ రవి

నారాయణవనం మండలంలోని మారుమూల పల్లె తిరువట్యం గ్రామానికి చెందిన ఆనంద రెడ్డి, మునెమ్మ దంపతుల ద్వితీయ సంతానం ఓ.రవి. చిన్ననాటి నుంచి సంగీత, సాహిత్యాలపై మక్కువ పెంచుకున్నారు. ఈక్రమంలో తెలుగ భాషాభిమానిగా రచనలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగంలో చేరకముందే తన ప్రతిభను చాటి సంగీత కళాశాల, వేద పాఠశాల నుంచి హరికథ ప్రవీణ, వేదశాఖిగా వినుతి నంది 'హావభావ నటనావైదుష్య' బిరుదులు పొందారు. తాను రచించిన పాటలు, గేయాలను దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాల్లో గానం చేసి ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకున్నారు. తెలుగు పండిట్‌గా పిల్లలకు ఉన్నతంగా పాఠ్యాంశాలు బోధిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారాలు కైవసం చేసుకున్నారు.

రచనలు
మాతదేవోభవ పుస్తకంతో పాటు వందల సంఖ్యలో గేయాలు రచించారు. వీటితో పాటు నాగలాపురం శ్రీ వేదనారాయణ శతకం, 'తెలుగు తల్లి నా కల్పవల్లి' హావ నారాయణ చరిత్రను ఆంధ్రీకరణ చేసి సత్తా చాటారు. అన్నమయ్య హరికథతోపాటు పెదవులు తగలకుండా పాడే పద్యాలను రచించారు. తాజాగా కీళపూడి శ్రీ జలకంఠేశ్వర స్వామిపై శతక రచనకు శ్రీకారం చుట్టారు.

భాషను మరవకూడదు
తెలుగు భాషను మరువకూడదు. హరికథ వంటి ప్రాచీన కళ అంతరించిపోకూడదు. అందుకు నా వంతు కృషి చేస్తున్నా. వంశపారంపర్యంగా వచ్చిన కళను అందరికీ పంచిపెట్టాలన్నదే లక్ష్యం. నేను రచించే కథలు, గేయాలకు మా తల్లిదండ్రులు, గురువు, భార్య మల్లీశ్వరి సహకారం ఎంతో ఉంది.
– ఓ.రవి, తెలుగు పండిట్



జానపదానికి ఊపిరి



డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న గంగాధరం



విజయవాడలో విద్యార్థులతో కలిసి రాష్ట్ర స్థాయి మొదటి బహుమతి అందుకుంటూ..

నింద్రకు చెందిన గంగాధరం అంతరించిపోతున్న జానపద కళకు ఊపిరిపోస్తున్నారు. ఆయన 2007–2008 హైదరాబాదులోని ఓ ప్రైవేటు కళాశాలలో జానపదం నత్యంపై పట్టా పొందారు. 2014లో ఎస్ఎస్ఏ ద్వారా పులికుంద్రం జెడ్పీ హైస్కూల్‌లో కాంట్రాక్ట్ డ్యాన్స్ మాస్టర్‌గా చేరారు. 2016 నుంచి ఏటా తమ పాఠశాల విద్యార్థులను జిల్లా స్థాయి జానపద నత్య పోటీల్లో చాంపియన్‌లుగా నిలుపుతున్నారు. 2019–20 నుంచి రాష్ట్ర స్థాయికి తమ విద్యార్థులు ఎంపికై య్యేలా శిక్షణ ఇచ్చారు. 2020–21 జాతీయ స్థాయి జానపద నత్య పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ ఏడాది సైతం రాష్ట్ర స్థాయికి ఎంపికై వచ్చే నెలలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి జానపద నత్య పోటీలకు విద్యార్థులను తీసుకెళ్లనున్నారు. అలాగే శ్రీకాళహస్తి శివరాత్రి మహోత్సవాల్లో, ముఖ్యమంత్రి పాల్గొనే ప్రభుత్వ కార్యక్రమాల్లో పులికుంద్రం జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన ఆకర్షణగా నిలుస్తుండడం విశేషం. ఈ క్రమంలో డ్యాన్స్ మాస్టర్ గంగాధరం పలువురు ప్రముఖుల నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు.

జానపదమే ఆదుకుంది
జానపద కళకు జీవం పోయడమే లక్ష్యం. కష్టాల్లో ఉన్నప్పుడు జానపద నృత్యమే ఆదుకుంది. మా పాఠశాల విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది, గొప్ప నృత్య కళాకారులుగా తయారు చేస్తా. ఈ ఏడాది జాతీయ స్థాయిలో చాంపియన్‌గా నిలబెట్టేందుకు పూర్తిస్థాయి శిక్షణ ఇస్తున్నా. అలాగే ద్రవిడ యూనివర్సిటీలో దూర విద్య ద్వారా ఎంఏ డ్యాన్స్ చదువుతున్నా.
– గంగాధరం, డ్యాన్స్ మాస్టర్



భక్తజనసంద్రంగా బోయకొండ



కిటకిటలాడుతున్న ఆలయం



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బోయకొండ శ్రీగంగమ్మ ఆలయం ఆశ్వయుజ ఆదివారం సందర్భంగా భక్తజనసంద్రంగా మారింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రహణం అనంతరం శుద్ధి పూజలు చేశారు. తదుపరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సర్వాలంకార శోభితంగా ముస్తాబుచేశారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ ప్రారంభమైంది. క్యూలన్నీ భక్తులతో నిండి కిటకిటలాడాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓచంద్రమౌళి పర్యవేక్షించారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కుబడులు చెల్లించారు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 47,351 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 23,836 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.03 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

సంచార జాతుల అభ్యున్నతే ధ్యేయం



మాట్లాడుతున్న పఠానీ

చిత్తూరు కలెక్టరేట్ : సంచార జాతుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్నాయని, కులవృత్తుల్లో నైపుణ్యం పెంచుకోవాలని కేంద్ర సంచార, సెమీ సంచార జాతుల సంక్షేమ బోర్డు మెంబర్ భరత్‌బాయ్ బాబూబాయ్ పఠానీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర సంక్షేమ పథకాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. విశ్వకర్మ యోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సంచార జాతుల జీవన విధానంలో మార్పులు తీసుకురావాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా పర్యటనలో పలు ప్రాంతాల్లో పర్యటించి సంచార జాతుల స్థితిగతులను, వారి సమస్యలను తెలుసుకున్నట్లు తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. అనంతరం సంచార జాతుల సంఘం సభ్యులు తమ సమస్యలను బోర్డు మెంబర్ దృష్టికి వారి తీసుకొచ్చారు. సంచార జాతుల సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, కుమార్ మహేంద్ర, చిత్తరంజన్, పలువురు పాల్గొన్నారు.

బీసీలే వైఎస్సార్‌సీపీకి వెన్నెముక



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, వేదికపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్

- ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- చిత్తూరులో వన్నెకుల క్షత్రియ సంఘ సమావేశం

చిత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీకి బీసీలే వెన్నెముక అని ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం చిత్తూరు గిరింపేట బీసీ భవనంలో ఆదివారం డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వన్నె కుల క్షత్రియ సంఘ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ తమ కుటుంబానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడ్డారన్నారు. రాజకీయ అనుభవంలేని తనకు రాజ్యాధికారాన్ని కట్టబెట్టరని తెలిపారు. కుప్పంలో వన్నె కుల క్షత్రియులు చూపిస్తున్న ఆధారాభిమానాలతో ఎమ్మెల్సీ పదవి వచ్చిందన్నారు. ఎంతో మంది రాష్ట్రాన్ని పాలించినా బీసీలను రాజకీయంగా ఎదగనివ్వలేదని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీలను రాజకీయంగా వెన్నుతట్టి పదవులు కల్పించి ప్రాధ్యానత ఇస్తున్నారని చెప్పారు. అలాంటి గొప్పనాయకుడిని రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

బీసీల ఎదుగుదలను ఓర్వలేని చంద్రబాబు
మరో ముఖ్య అతిథి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలను చంద్రబాబు ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తారని విమర్శించారు. బీసీల రాజకీయ ఎదుగుదలను ఆయన జీర్ణించుకోలేరని తెలిపారు. బీసీల చేతిలోనే గెలుపోటములుంటాయని, వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ సమిష్టిగా ఉందాం..వైఎస్సార్‌సీపీన్ని బలోపేతం చేద్దాం అని పిలుపునిచ్చారు. బీసీ నాయకులు జ్ఞాన జగదీష్, భూపేష్ గోపినాథ్ మాట్లాడుతూ పథకాలన్నీ బడుగు బలహీన వర్గాల వారే అధికంగా పొందుతున్నారని చెప్పారు. అనంతరం పలువురు మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలపై ప్రసంగించారు. గుడిపాల ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సంఘ సభ్యులు మోహన్‌వేలు, చిట్టిబాబు, వెంకటేష్, గోపి, కుమార్, పెరియస్వామి, నారాయణస్వామి, శివయ్య, అణ్ణామలై, ఆరుముగం తదితరులు పాల్గొన్నారు.

కొళ్లాపురమ్మను కొలుస్తూ.. కట్టుబాట్లు పాటిస్తూ!

ఎక్కడో పుట్టారు.. మరెక్కడో పెరిగారు.. పొట్టకూటి కోసం వచ్చారు.. అందరూ ఒక్కటయ్యారు.. సంఘ జీవులుగా మారారు.. సమష్టిగా పనులు చేసుకుంటారు.. పొరపొచ్చాలు లేకుండా సర్దుకుపోతుంటారు.. సమస్య వస్తే కట్టుగా నిలబడతారు.. గ్రామ పెద్దల మాటే వేదంగా భావిస్తారు.. కష్టం చేసుకుని కుటుంబాలను పోషించుకుంటారు. కక్షలు, కార్పణ్యాలకు ఆమడ దూరంలో ఉంటారు. కట్టుబాట్లకే అధిక ప్రాధాన్యమిస్తారు.. రెండు అడుగుల స్థలం కోసం కూడా మానవ సంబంధాలను తృణప్రాయంగా వదులుకునే నేటి సమాజంలో గిరిపుత్రులైనా ఆదర్శవంతంగా జీవనం సాగిస్తున్నారు. గ్రామదేవత కొళ్లాపురమ్మ సన్నిధిలో తీసుకునే నిర్ణయాలే వేదవాక్కుగా ముందుకు సాగుతున్నారు. తిరుపతి జిల్లాలోని నారాయణవనం మండలం, అరణ్యకండ్రిగ పంచాయతీ, పడివేటమ్మ ఎస్టీ కాలనీ వాసుల జీవనశైలిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- వలస వచ్చి ఒక్కటైన గిరిపుత్రులు
- ప్రశాంతంగా పల్లెవాసుల బతుకులు
- పొరపొచ్చాలకు తావులేని ఆదర్శజీవులు
- కూలి పనులతో పొట్టపోసుకుంటున్న కుటుంబాలు


పడివేటమ్మ ఎస్టీ కాలనీ వ్యూ

సాక్షి, తిరుపతి : నారాయణవనం మండలంలో పడివేటమ్మ ఎస్టీ కాలనీ అనే కుగ్రామం ఉంది. ఇక్కడ 80 కుటుంబాలు నివసిస్తున్నాయి. సుమారు 80 ఏళ్ల క్రితం వీరంతా వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. అప్పట్లో మామిడి తోటల్లో, రైతుల వద్ద పనిచేస్తూ కొందరు జీవనం సాగించేవారు. మరికొందరు కనీసం ఇల్లు కూడా లేకపోవడంతో సమీపంలోని గోవిందప్పనాయుడు కండ్రిగ బడిలో రాత్రుళ్లు తల దాచుకునేవారు. ఇంకొందరు హైవే సమీపంలో కప్పల గుంటలో స్నానం చేసి పక్కనే ఉన్న రావి చెట్టు కింద కాలం గడిపేవారు. పడివేటమ్మను ఆరాధించడం ప్రారంభించారు. కొన్నాళ్ల తర్వాత స్థానిక రైతుల చేయూతతో కప్పల గుంటను పూడ్చుకుని కాలనీ ఏర్పాటు చేసుకున్నారు. తొలుత ఆరు గుడిసెలతో ప్రారంభమైన గ్రామంలో ఇప్పుడు 60 పక్కా ఇల్లు ఉన్నాయి. పడవేటమ్మ కటాక్షంతోనే ఊరు ఏర్పడిందని కాలనీకి ఆ దేవత పేరే పెట్టుకున్నారు. అలాగే స్థానిక రైతుల సాయంతో తమ కులదేవత కొళ్లాపురమ్మ ఆలయాన్ని గ్రామంలో నిర్మించుకున్నారు. నిత్యం భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించుకుంటుంటారు.

కట్టుదాటకుండా..

ఊరు ప్రారంభమైనప్పటి నుంచి కట్టుబాట్లు, అలవాట్లు, ఆచారాలకు పడివేటమ్మ కాలనీ యానాదులు ప్రాధాన్యమిస్తున్నారు. గ్రామ పెద్దల మాటంటే శాసనంగా భావిస్తారు. ఏదైన సమస్య వస్తే సాయంత్రం వేళ అందరూ గ్రామ దేవత కొళ్లాపురమ్మ ఆలయ ప్రాంగణంలో సమావేశమవుతారు. సమస్యపై చర్చించి పెద్దల మాటను సగౌరవంగా స్వీకరించి, సర్దుకుపోతుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కట్టుదాటరు.. సమస్యను ఊరు హద్దులు దాటించరు. ఎప్పుడూ ఏ సమస్యనూ పోలీస్‌స్టేషన్ వరకు తీసుకెళ్లరు. ఈ క్రమంలోనే గిరిపుత్రులకు ఆధ్యాత్మిక చింతన కూడా అధికంగానే ఉంది. మంగళ, శుక్రవారాలు, పండుగ రోజుల్లో కొళ్లాపురమ్మ, పడివేటమ్మ ఆలయాల్లో గడుపుతారు. ఆదివారం కాలనీ సమీపంలోని చర్చిలో ప్రార్థనలు చేసుకుంటారు. ఒకరి వ్యక్తిగత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకుండా ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారు.

వైఎస్సార్ హయాంలో..

అటవీ ప్రాంతంలోని మారుమూల పల్లె అయిన పడివేటమ్మ ఎస్టీ కాలనీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో అభివృద్ధికి నోచుకుంది. అప్పట్లోనే రూ.11లక్షల వ్యయంతో రోడ్లు, కాలువలు నిర్మించారు. ఆయన పాలనలోనే ఇక్కడ 50 కుటుంబాలకు పక్కా ఇళ్లు కట్టించారు.

మద్య నిషేధం

ఈఊరికి దరిదాపులో కూడా మద్యం అమ్మకూడదనే కట్టుబాటును కఠినంగా అమలు చేస్తున్నారు. గ్రామం ఏర్పడినప్పటి నుంచి దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. అటవీప్రాంతం కాబట్టి ఎవరైనా సారా కాస్తుంటే ఊరంతా ఒక్కటవుతారు. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటారు.


కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

కష్టజీవులు

పడివేటమ్మ కాలనీ యానాదులు స్వతహాగా కష్టజీవులు. ఉదయం నిద్ర లేచింది మొదలు ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉంటారు. సమీపంలోని అడవి నుంచి ఈత ఆకులు తీసుకువచ్చి చీపుర్లు తయారు చేసి విక్రయిస్తుంటారు. గ్రామ సమీపంలోని రైతుల పొలాల్లో కూలి పనులకు వెళుతుంటారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక పనిలో ఉండడంతో వారికి ఇతర విషయాలను పట్టించుకునే తీరిక ఉండదు.

కాలనీలో మొత్తం 192 మంది

మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ విస్తీర్ణంలో 15 హ్యాబిటేషన్లు ఉన్నాయి. పంచాయతీ పరిధిలోని ఆరు ఎస్టీ కాలనీల్లో పడివేటమ్మ ఎస్టీ కాలనీ ఒకటి. ఈ కాలనీలో మొత్తం 80 కుటుంబాలు, 192 మంది జనాభా ఉన్నారు. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాన్ని ఎస్టీకి కేటాయించడంతో పడివేటమ్మ యానాది కాలనీవాసి రత్నమ్మ వైఎస్సార్‌సీపీ మద్దతుతో 420 ఓట్లకు పైగా మెజార్టీతో గెలుపొందింది. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ప్రాథమిక పాఠశాల ఉంది.

అడవి బిడ్డలు

కాలనీ సమీపంలోని అడవే వీరికి జీవనాధారం. ఏడాదిలో నాలుగు నెలల పాటు ఈత ఆకు తెచ్చుకుని చీపురులు తయారు చేస్తారు. చెన్నై, తిరుపతి నుంచి వచ్చే వ్యాపారులు ఒక్కో చీపురును రూ.30లకు కొనుగోలు చేస్తుంటారు. వీరికంటూ సాగు భూములు లేవు. వ్యవసాయ కూలిపనులే దిక్కు. మరికొందరు రైతుల వ్యవసాయ పొలాల వద్ద కాపలాగా ఉంటారు. చదువుకున్న యువకులు శ్రీసిటీ, రేణిగుంట పారిశ్రామిక వాడల్లో పనిచేస్తున్నారు.

అందరి సహకారంతోనే..



కాలనీలో అందరి సహకారంతోనే ప్రశాంతంగా ఉంటున్నాము. అరణ్యం కండ్రిగ పంచాయతీకి కాలనీ నుంచి సర్పంచ్‌గా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పూర్తి సహకారంతో ఎన్నికై తన వంతు అభివృద్ధి చేపట్టాను. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం పూర్తయింది. కాలనీలోని పూరి గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు కట్టుకుని సొంతింటి కల నెరవేర్చుకున్నాం

-రత్న, సర్పంచ్, అరణ్యంకండ్రిగ

మనం అనుకుంటే సమస్యే లేదు



ఏదైనా మనది అనుకుంటే బేధాలు ఉండవు. సమస్యలు తలెత్తవు. పడివేటమ్మ ఎస్టీ కాలనీ వాసులు తమ పనుల్లో నిమగ్నమై, వ్యక్తిగత తగాదాలకు దూరంగా ఉంటున్నారు. తమ పిల్లలను చదివిస్తే ప్రతి కుటుంబం ఆదర్శభావాలతో ఎదిగే అవకాశం ఉంటుంది.

- పరమేశ్ నాయక్, ఎస్‌ఐ, నారాయణవనం

ఒకే కుటుంబం అనుకొంటాం



నా వయస్సు 54. కాలనీలోనే పుట్టి ఇక్కడే పెళ్లిచేసుకున్నా. కాలనీలో అందరం ఒకే కుటుంబంగా భావిస్తాం. అందుకే ఏదీ సమస్యగా తీసుకోం. - **బత్తెమ్మ**

సమస్యలు మేమే పరిష్కరించుకుంటాం



ఉదయమైతే అందరం ఏదో ఒక కూలి పనికి పోయి సాయంత్రానికి ఇంటికి చేరుకుంటాం. బాగా అలసి పోతాం.. ఇంటికొస్తే ఏదో తినేసి నిద్ర పోతాం. మాట్లాడుకునే తీరిక ఉండదు. సమస్యలొస్తే గ్రామ పెద్దలతో కలిసి కొల్లాపురమ్మ ఆలయంలో చర్చించి, సర్దుకుంటాం. - **వెంకటేష్**

వీహెచ్‌ఎస్‌ల ఏర్పాటు అవసరం



కాలనీలోనే పుట్టి పెరిగాను. గతంలో వన సంరక్షణ సమితులతో అడవుల్లో పనులు చేసుకునే వాళ్లము. ఫలసాయం పొందేవాళ్లము. ఇప్పుడు వీహెచ్‌ఎస్‌లు లేవు. తిరిగి వీటిని పునరుద్ధరిస్తే బాగుంటుంది.

- చెంగమ్మ

జాయింట్ సెక్రటరీకి సత్కారం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి విచ్చేసిన సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డిని వీఆర్‌వోల అసోసియేషన్ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీరెడ్డి, పద్మనాభం కలిసి, పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. అనంతరం వీఆర్‌వోల సమస్యలు, పలు రెవెన్యూ అంశాలను జాయింట్ సెక్రటరీతో ఆ సంఘ నాయకులు కాసేపు చర్చించారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం నాయకులు

పెద్దిరెడ్డి కుటుంబం కోసం ఉద్యోగానికి రాజీనామా


అలీంను అభినందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: రానున్న ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యుల గెలుపు కోసం పనిచేసేందుకు సౌదీ అరేబియాలో ఉద్యోగం చేస్తున్న ఆర్.అలీమ్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. రొంపిచెర్ల పంచాయతీ సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ కుమారుడు అలీమ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ నెలకు రూ.6.60 లక్షల జీతం తీసుకుంటున్నారు. ఉద్యోగాన్ని వదిలి రొంపిచెర్లకు వచ్చారు. ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అలీంను మంత్రి అభినందించారు. రాజకీయాల్లో తండ్రి పేరు నిల బెట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో చైతన్యం తేవాలని తెలిపారు. అలీం మాట్లాడుతూ తన తండ్రి కష్టకాలంలో ఉన్నప్పుడు మంత్రి పెద్దిరెడ్డి ఆదుకున్నారని తెలిపారు. అందుకే ఉద్యోగం వదలి పెద్దిరెడ్డి కుటుంబం కోసం పని చేస్తానని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డిని కలసిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, వైస్ ఎంపీపీ విజయశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరీముల్లా, శ్రీనాథనాయుడు, మోహన్ రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

రంగాపురం దేవరెద్దు కన్నుమూత


శివైక్యం చెందిన దేవరెద్దు

పాలసముద్రం: రంగాపురం గ్రామానికి చెందిన మల్లెంపాటి వంశస్తులు ఆరాధ్యదైవంగా పూజించే దేవరెద్దు ఆదివారం శివైక్యం చెందింది. ఈ సందర్భంగా మల్లెంపాటి వంశస్తులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఈ దేవరెద్దును చుట్టుపక్కల ప్రజలు కొలుస్తున్నట్లు తెలిపారు. అన్ని కులాల వారు కలసి ఏటా ఉత్సవాలు నిర్వహించి ఘనంగా ఊరేగింపు చేసేవారమని పేర్కొన్నారు. దేవరెద్దు దహన క్రియలకు ముందు అమ్మగారి ఇల్లుగా కొలిచే పొదిలి వంశస్తులు పసుపు, కుంకుమ సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేద మంత్రోచ్చారణల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కడసారి దర్శనం చేసుకున్నారు.

కరెంట్ షాక్‌తో ఎనర్జీ అసిస్టెంట్ మృతి


మృతి చెందిన హరీష్(ఫైల్)

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగులో విద్యుత్ షాక్ తగిలి ఆదివారం ఎనర్జీ అసిస్టెంట్ మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఆళ్లమడుగు దళితవాడకు చెందిన ఏ.మణెయ్య, బుజ్జి దంపతుల కుమారుడు ఏ.హరీష్(26) అదే గ్రామ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. యనమలమంద గ్రామ సమీపంలో పొలాల వద్ద విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగులుతుండడంతో ఆదివారం ఉదయం తొలగించేందుకు వెళ్లాడు. కొమ్మలు నరుకుతున్న సమయంలో పెద్ద లైను తగిలి షాక్ కొట్టడంతో తీవ్రగాయాలతో కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రైవేటు వాహనంలో పచ్చికాపల్లం తీసుకురాగా, అక్కడి నుంచి 108 వాహనంలో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.

డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శ

సమాచారం అందిన వెంటనే ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి స్విమ్స్ వద్దకు చేరుకున్నారు. వైద్యులతో మాట్లాడేందుకు ప్రయత్నించే లోపే మృతి హరీష్ చెందాడు. కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి, ట్రాన్స్‌కో అధికారులు సంయుక్తంగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఘటనపై వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

పొదుపు సొమ్ము రూ.16 లక్షలు స్వాహా?

- రహస్యంగా విచారణ
- సబ్ పోస్ట్‌మాస్టర్‌పై వేటు

పుంగనూరు: చౌడేపల్లె మండలం, పుదిపట్ల బ్రాంచ్ పోస్టాఫీసులో ప్రజల పొదుపు ఖాతాల్లోని డబ్బు సుమారు రూ.16 లక్షలు స్వాహా అయ్యింది. దీనిపై పోస్టల్ అధికారులు రహస్యంగా విచారణ చేస్తున్నట్టు సమాచారం. వివరాలు ఇలా..బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలోని ప్రజలు ప్రతి నెలా రకరకాల పొదుపులు చేస్తారు. బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ దేవిక వద్ద డబ్బులు చెల్లిస్తారు. ఆమె నిబంధనల మేరకు డబ్బులు తీసుకున్న వెంటనే ఖాతా పుస్తకంలో నమోదు చేసి, సీలు వేసి, సంతకం పెట్టి ఖాతా బుక్కులు ఇవ్వాలి. కానీ ఇక్కడ ఇందుకు విరుద్ధంగా ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేసి ఆమె పుస్తకాల్లో నమోదు చేయకుండా స్వాహా చేసినట్లు గత నెలలో వెలుగు చూసింది. ఈ క్రమంలో అధికారులు గుట్టుచప్పుడు కాకుండా విచారణ చేసి, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ దేవికను విధుల నుంచి తప్పించారు. ఆమె స్థానంలో వేరొకరిని నియమించారు. వసూలు చేసిన డబ్బులు తిరిగి వారికి చెల్లించాలని దేవికను ఆదేశించారు. ఇలా ఉండగా నెల రోజులు గడుస్తున్నా కొంత డబ్బులు మాత్రమే చెల్లిస్తుండడంతో బాధితులు ఘర్షణలకు దిగడంతో ఈ ఘటన వెలుగు చూసింది.

వాస్తవమే..

పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ ఈ వ్యవహారంపై మాట్లాడుతూ వాస్తవమేనన్నారు. విచారణ చేస్తున్నామని, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ దేవికను విధుల నుంచి తప్పించామని తెలిపారు. ప్రజలు ఆమెకు డబ్బులు ఇచ్చినట్లు ఆధారాలు లేవన్నారు. రూ.50 వేలకు మాత్రమే ఆధారాలు లభించాయన్నారు. బాధితులు ఎవరైనా ఆధారాలతో తమకు ఫిర్యాదు చేస్తే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాధ్యురాలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని స్పష్టం చేశారు. ఈ విషయమై దేవికను విచారించగా ఎలాంటి అక్రమాలు ఏమి జరగలేదని, ఇది వాస్తవం కాదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన గుణశేఖర్

గంగవరం: మండలంలో ని పలమనేరు-బెంగళు రు జాతీయ రహదా రిలోని గోశాల సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం ఊటొంక గ్రామానికి చెందిన గుణశేఖర్(37), మణి(32) పెయింటర్స్‌గా పని చేస్తున్నారు. ఇద్దరూ ద్విచక్ర వాహనంలో బెంగళూరు వైపు వెళ్తున్నారు. పలమనేరు సమీపంలోని గోశాల వద్ద జాతీయ రహదారిపై కారు అతి వేగంగా ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రగాయాలకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గుణశేఖర్ మృతి చెందగా, ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న మణిని వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్, అందులోని ప్రయాణికులు కారును ఘటన స్థలంలోనే వదిలి పరారయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొజ్జల సుధీర్ వ్యాఖ్యలు హేయం

తిరుపతి క్రైం : శ్రీకాళహస్తి సీఐపై టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలు హేయమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఎస్పీ కార్యాలయం సమీపంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను ఇటీవల టీడీపీ నేతలు దహనం చేస్తుంటే సీఐ అడ్డుకున్నారని, అది ఆయన విధి నిర్వహణలో భాగమని తెలిపారు. అయితే ఇది మనసులో పెట్టుకుని బొజ్జల సుధీర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి విధి నిర్వహణలో ఉన్న సీఐని బెదిరించడం, దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. పోలీసులు అనుకుంటే పొలిటీషియన్ కావచ్చని, అదే రాజకీయనాయకుడు ఎప్పటికీ పోలీస్ కాలేడని స్పష్టం చేశారు.

శాస్త్రోక్తంగా గ్రహణ శాంతి పూజలు

కాణిపాకం(యాదమరి): చంద్ర గ్రహణం అనంతరం ఆదివారం వేకువజామున ఆలయంలో శాస్త్రోక్తంగా శాంతి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం ఆలయం మూసి వేశారు. గ్రహణం వీడిన తరువాత ఆదివారం వేకువజామున ఆలయ శుద్ధి చేసి పుణ్యాహవచనం, గ్రహణ శాంతి, అభిషేకాలు నిర్వహించి, తదుపరి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

థియేటర్‌లో నటుడు యువ సందడి

నగరి: బాలకృష్ణ హీరోగా నటించిన భగవంత్ కేసరి సినిమాలో నటించిన నటుడు యువ ఆదివారం నగరి ఎస్‌జె సినిమా థియేటర్‌లో సందడి చేశాడు. సినిమాకు విచ్చేసిన ప్రేక్షకులు అతనితో సెల్ఫీలు దిగడం ప్రత్యేకతను సంతరించుకుంది. తొలుత నగరి గ్రామ దేవత సామాలమ్మ ఆలయంలో పూజలు చేసిన యువ అనంతరం భగవంత్ కేసరికి ప్రేక్షకుల ఆదరణను పరిశీలించేందుకు ఎస్‌జే సినిమా థియేటర్‌కు వెళ్లారు.


శ్రీనివాస థియేటర్‌లో ప్రేక్షకులతో సెల్ఫీ సందడి